ప్రజాశక్తి
బుధవారం 8 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం



నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మెప్మా పీడీ వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 15 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని, 1200 మంది వరకు నిరుద్యోగ యువత హాజరు కానున్నట్లు తెలిపారు. కనీసం వెయ్యి మందికి ఉపాధి కల్పించటమే ధ్యేయంగా ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. జాబ్‌మేళా రోజు కూడా స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని, నేరుగా హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టేట్ మిషన్ డైరెక్టర్, మెప్మా అధికారి ఎన్.తేజ్ భరత్, ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరు కానున్నట్లు తెలిపారు.

ట్రంప్ సుంకాలతో ఉపాధికి దెబ్బ

- జిల్లాలో ఫార్మారంగం, కార్మికులపై తీవ్ర ప్రభావం
- ఆక్వా, పాడి పరిశ్రమలకూ నష్టదాయకం
- మొక్కజొన్న, పత్తి రైతులకూ కష్టకాలమే
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తులసీదాస్ తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలతో దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల ఉపాధికి తీవ్ర దెబ్బ తగులుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో 'ట్రంప్ సుంకాలు - మోడీ మౌనం' అంశంపై మంగళవారం నిర్వహించిన నిరసన సభలో ముఖ్య వక్తగా మాట్లాడారు. ఫార్మా రంగంపై ట్రంప్ విధించిన సుంకాలతో జిల్లాలోని రసాయనిక పరిశ్రమలు, అందులో పనిచేస్తున్న కార్మికులపై తీవ్ర ప్రభావం చూపనుందని చెప్పారు. ప్రధానంగా తీర ప్రాంతంలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న ఆక్వా రంగం దెబ్బతింటుందని తెలిపారు.

రొయ్యలపై సుంకాల పెంపుతో ఉత్పత్తులు నిలిచిపోయి ఆక్వా రంగం, దానిపై ఆధారపడే కుటుంబాలు, రొయ్యల ఫీడ్ తయారు చేసే కంపెనీలు, అందులో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రొయ్యలకు మేతగా ఉపయోగపడే మొక్కజొన్న పంట ధర పడిపోతుందన్నారు. పత్తిపై సుంకాలతో జిల్లాలో పత్తి సాగుపై ఆధారపడిన రైతులకు గిట్టుబాటు ధర దొరకని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో మహిళలకు కాస్తాకూస్తో ఉపాధి కల్పిస్తున్న పాడి పరిశ్రమ కూడా నష్టం వాటిల్లనుందని చెప్పారు. అమెరికా వెళ్లి స్థిరపడుదామని ఆశించిన వారికి హెచ్1బి వీసాలపై ఆంక్షలతో వారి ఆశలు నీరుగారిపోయాయన్నారు. ట్రంప్ సుంకాలు ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నా మోడీ మాత్రం మౌనం వీడటం లేదన్నారు. మోడీ మౌనం వీడేలా చంద్రబాబు, పవన్, జగన్ ఒత్తిడి చేయాలన్నారు.

అమెరికా ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడంతో పాటు ఆయుధాలు, డాలర్లతో ప్రపంచ దేశాలపై పెత్తనం కోసమే ట్రంప్ సుంకాలు విధిస్తున్నారని చెప్పారు. ట్రంప్ సుంకాలను తాము అంగీకరించేది లేదని, అమెరికన్ ఉత్పతులపై తామూ సుంకాలు విధిస్తామని బ్రెజిల్, మెక్సికో వంటి దేశాలు తిరగబడ్డాయని తెలిపారు. మోడీ మాత్రం ప్రతిఘటించకుండా బతిమలాడే ధోరణిని అవలంభిస్తున్నారని చెప్పారు. రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేయాలని ట్రంప్ చెప్పినా మోడీ వినకపోవడం రెండు రకాల ప్రయోజనాలు దాగున్నాయన్నారు.

రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేస్తే పెట్రోలియం, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి అన్నిరకాల వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందన్నారు. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుందని ఉద్దేశంతోనే మోడీ నిరాకరించారని చెప్పారు. రష్యా నుంచి వస్తున్న చమురుతో ముఖేష్ అంబానీ,ఇతన చమురుశుద్ధి కర్మాగారాలు వాటితో వచ్చే రకరకాల ఉత్పత్తులను విదేశాలకు అధిక ధరలకు అమ్మి లాభపడటం కోసం కూడా చమురు దిగుమతులు ఆపకపోవడానికి మరో కారణంగా ఉందన్నారు.

ట్రంప్ సుంకాల ప్రభావంతో ఉపాధి, వీసాలపై ఆంక్షలతో అమెరికా అవకాశాలు నీరుగారిపోతున్న నేపథ్యంలో ఒక రకమైన సంక్షోభం నెలకొందన్నారు. ఇందుకు దారితీసిన పరిస్థితులను ప్రజలకు వివరించాలన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే ప్రచారంలో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని, దాన్ని ఉపయోగించుకుని ప్రజలను కదిలించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, నాయకులు పి.తేజేశ్వరరావు, పార్టీ శ్రేణులు, ప్రజా, కార్మిక, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నిరసన

ప్రజాశక్తి - రణస్థలం

ఆశావర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఎపి ఆశావర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పాతర్లపల్లి, రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశాలకు ఆరేళ్ల నుంచి వేతనాలు పెంచలేదని అన్నారు. పనిభారం పెరిగిందని పేర్కొన్నారు. రోగులకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి పెన్షన్ ఇవ్వాలని కోరారు. జాతీయ, పండగ, వారాంతపు, మెడికల్ అన్ని రకాల సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5జి మొబైల్స్ ఇవ్వాలన్నారు. నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సికి వెళ్లిన ప్రతి సందర్భంలో టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జి.గౌరి, సిహెచ్.తవుడమ్మ, ఎల్.జ్యోతి జి.సత్యవతి, జి.భారతి, ఎం.సుగుణ, బి.నాగమణి, జి.రూపవతి పాల్గొన్నారు.

గార : ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా గార, శ్రీకూర్మం పిహెచ్‌సిల వద్ద నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వి.ఉదయకుమారి, కె.నీలమ్మ, కె.కృష్ణవేణి, ఎల్.విజయలక్ష్మి, ఎస్.సరోజని, దీప, భాను, లక్ష్మి, ఉమ పాల్గొన్నారు.



రణస్థలం : నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

జి.సిగడాం : ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు టి.త్రినాథరావు డిమాండ్ చేశారు. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జి.సిగడాం, బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సిహెచ్‌ఒ సత్యంనాయుడును కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెలమల రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, మౌళి, రాజు, రాధ, ఉషా, రాము పాల్గొన్నారు.

పలాస : ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాశీబుగ్గ సూదికొండ, నర్సిపురం పిహెచ్‌సిల వద్ద భోజన విరామం సమయంలో నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను పిహెచ్‌సి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వై.హేమలత, జ్యోతి, శ్రీదేవి, లక్ష్మీకాంతం, పుణ్యవతి జీవన, లలిత, హేమావతి, రూప, నర్సిపురం పిహెచ్‌సి సబితా పాత్రో, మీనా, జ్యోతి మహంతి, పుణ్యవతి, మంజు, యశోద, లక్ష్మి, సూదికొండ పిహెచ్‌సి ఎం.లావణ్య, పి.పార్వతి, రాణి, జి.జ్యోతి, రజని, శ్రీదేవి, లలిత పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఆశా డే సందర్భంగా మండలంలోని అన్ని పిహెచ్‌సిల వద్ద మధ్యాహ్న భోజన సమయంలో సిఐటియు ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను పిహెచ్‌సి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో బి.లక్ష్మి, బి.సావిత్రి, ఎల్.శాంతి, కె.అరుణ, కె.ధనలక్ష్మి పాల్గొన్నారు.



జి.సిగడాం : నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



గార : వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

16 మండలాల్లో పంట నష్టం

- సీజనల్ వ్యాధులపై పకడ్బందీ చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

భారీ వర్షాల కారణంగా జిల్లాలోని 16 మండలాల్లో పంట నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మండల అధికారులతో పలు శాఖల పురోగతిపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సంతబొమ్మాళిలో వెయ్యి ఎకరాలు, పాతపట్నంలో 625 ఎకరాలు, కొత్తూరు, హిరమండలంలో 250 ఎకరాల చొప్పున నష్టం సంభవించినట్లు అధికా రులు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం మొలకెత్తడం, ధాన్యం పొట్టు దశలో నీరు చేరడం, పూత వాష్ ఔట్ అవ్వడం వంటి నష్టం వాటిల్లినట్లు చెప్పారు. పంట నష్టంపై తక్షణమే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. పంట నమోదు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, డయేరియాను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని, కాలువలు శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, తాగునీటి నమూనాలను త్వరితగతిన పరీక్షించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చేతి శుభ్రత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సంపూర్ణ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలోని 159 హాస్టల్స్‌ను తనిఖీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అరసవల్లి ఆలయం భక్తులకు అందించిన సేవల్లో ఈ వారం రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించడంపై కలెక్టర్ అభినందించారు. ఇంజినీరింగ్ పనుల్లో పూర్తయిన వాటికి బిల్లులు పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి - పలాస

మండలంలోని చినంచల పంచాయతీ పరిధిలో ఉన్న రైతులు యూరియా కోసం మంగళవారం సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచే సచివాలయం దగ్గర పడిగాపులు కాసిన రైతులకు యూరియా ఒక్క బస్తా కూడా అందించలేదని వాపోయారు. యూరియా లభించకపోవడంతో రైతులు సచివాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. గ్రామానికి వచ్చిన యూరియా ఓ వర్గం తీసుకున్నారన్నారని ఆరోపించారు. పొట్ట దశలో ఉన్న వరి చేలుకు అధికారులు యూరియా సరఫరా చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా సరఫరా చేయకుండా అధికారులు ముఖం చాటేయడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. తమ పొలాల్లో ఒక్కసారి కూడా యూరియా వేయని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల దిగుబడి తగ్గితే తీవ్రంగా నష్టపోతా మని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా సరఫరా చేయకుండా వ్యవసాయ అధికారులు అన్నదాతలను నిండా ముంచారని వాపోయారు. రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేస్తామని ప్రగల్భాలు పలికిన అధికారులు యూరియా సరఫరా చేయకుండా ముఖం చాటేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతు సమస్యలను పరిష్కరించకపోతే ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడిస్తా మని హెచ్చరించారు. గ్రామాల్లో యూరియా మాటకేమో గానీ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుం దని మహిళలు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూరియా అందించాలని డిమాండ్ చేశారు. చినంచల ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

సిజెఐపై దాడి గర్హనీయం

మతోన్మాద చర్యలను ఖండించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయ్‌పై ఓ సనాతన ఉగ్రవాది దాడి చేయడం గర్హనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద మంగళవారం సిజెఐపై దాడిని నిరసిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిజెఐపై దాడిని ఒక వ్యక్తి చేసిన దాడిగా చూడకూడదని, బిజెపి, సంఘపరివార్ శక్తుల సమాజంలో నింపుతున్న మతోన్మాద విష బీజాల ఫలితమేనన్నారు. జస్టిస్ బిఆర్ గవాయ్ తల్లిని నాలుగు రోజుల కిందట ఆర్‌ఎస్‌ఎస్ సభలకు పిలిచినా ఆమె నిరాకరించారని, ఆ ద్వేషంతోనే దాడికి పాల్పడ్డాడని చెప్పారు. మతోన్మాద శక్తులకు లొంగి ఉండాలన్న సందేశం కోసం దాడి చేశాడని తెలిపారు. బిజెపి, సంఘపరివార్ శక్తుల మతోన్మాద చర్యలను తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

'ఐలు' ఆధ్వర్యాన...

శ్రీకాకుళం లీగల్ : ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యాన జిల్లా కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐలు జిల్లా అధ్యక్షులు దుంపల రమణారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సిజెఐపై దాడి రాజ్యాంగంపై జరిగిన దాడి అని అన్నారు. ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. భారత అత్యున్నతమైన న్యాయస్థానంలో ఉండే ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏం రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఐలు కార్యదర్శి డి.ఈశ్వరరావు, బిసి న్యాయవాదుల సంఘం నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల నాయకులు నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీకాకుళం బార్ అసోసియేషన్ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు తైక్వాండో శ్రీను, కె.వేణు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అన్నింటికీ చదువే మూలం

- విద్యార్థులు లక్ష్యంతో చదితే ఉన్నత శిఖరాలు
- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ, ఎచ్చెర్ల, లావేరు, ఆమదాలవలస

మధ్యాహ్న భోజన పథకం ఆహార నాణ్యతలో రాజీ పడకూడదని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు, శ్రీకాకుళం పట్టణం, ఎచ్చెర్ల, లావేరు, ఆమదాలవలస మండలాల్లో మంగళవారం పర్యటించారు. శ్రీకాకుళం అర్బన్ హయాత్ నగర్, నీలంకాలనీ, వరం వీధిలో రేషన్ డిపో, అంగన్వాడీ కేంద్రాలు, ఎచ్చెర్లలో అంగన్వాడీ కేంద్రం, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం (బాలికలు), లావేరు మండలంలో అల్లినగరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, మురపాక కెజిబివి, ఆమదాలవలస మహాత్మాగాంధీ పూలే వసతిగృహాన్ని, తిమ్మాపురం, జగ్గుశాసనపేట వద్ద గల కెజిబివిలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకొని చదవా లన్నారు. అన్నింటికీ చదువే మూలమని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను సక్రమంగా అర్థం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. మంచి ఉద్యోగంలో స్థిరపడితే తల్లిదండ్రులకు మీ తరుపున అదే మంచి బహుమతి అవుతుందన్నారు. ప్రస్తుతం అంతా డిజిటల్ యుగం నడుస్తుందన్నారు. మనం కూడా కాలానికి అనుగుణంగా మారాలన్నారు. మనసుంటే మార్గం ఉంటుందని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం మీరందరూ రాష్ట్ర భవిష్యత్‌కు ఒక సంపదన్నారు. భవిష్యత్‌లో కలెక్టర్లు, డాక్టర్లు, ఏ వృత్తిలో స్థిరపడిన ధర్మం, నీతి, నిజాయితీతో ప్రజలు దగ్గర మెలిగి, ప్రజల మనసును గెలుచుకోవాలన్నారు. మనలో నైపుణ్యం ఉంటే భవిష్యత్‌లో మంచి వృత్తిలో ఉంటామని విద్యార్థులనుద్దేశించి పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనాలు పరిశీలన

మధ్యాహ్న భోజన పథకాన్ని పలు చోట్ల పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనం చేసి వంటకాలను రుచి చూసి, మెనూ అమలు సక్రమంగా జరుగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌లో విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని తెలిపారు. గంజి వడబోయకుండా వండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, పోషణ రంగాల్లో నాణ్యతపై అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఫిర్యాదులు వచ్చినచో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల స్టాక్ పాయింట్‌లో ఉన్న సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణ, సక్రమంగా ఉన్నవీ, లేనివీ తనిఖీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి గుంట సూర్యప్రకాశరావు, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు డి.మధుసూదనరావు, డిఇఒ ఎ.రవిబాబు, డిసిఒ వై.యశోదలక్ష్మి, తూనికలు, కొలతలశాఖ అధికారి బలరామకృష్ణ, ఆహార భద్రత అధికారి లక్ష్మి, పౌర సరఫరాల డిటి అనిల్‌కుమార్, ఎచ్చెర్ల సిడిపిఒ పాపినాయుడు పాల్గొన్నారు.



వంటకాలను పరిశీలిస్తున్న విజయ ప్రతాప్‌రెడ్డి

తాబేళ్లు... సముద్రానికే రక్షకులు

ప్రజాశక్తి- కవిటి

వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కవిటి మండలం బట్టివాణిపాలెంలో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యాన మత్స్యకారులకు మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు మాట్లాడుతూ సముద్ర తాబేళ్లు కేవలం ఒక జీవజాతి మాత్రమే కాదని, అవి సముద్రానికి సహజ రక్షకులని అన్నారు. ముఖ్యంగా సముద్ర తాబేళ్లు తీరప్రాంతాల ఎకో సిస్టమ్‌కి పునాది వంటివని, అవి సముద్రంలో ఉత్పత్తయ్యే పచ్చి మొక్కలు, ఆల్గీ పెరుగుదలని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అలలతో కొట్టుకుపోయే ఇసుక తీరాలను, సముద్ర తీర జీవ వ్యవస్థను సుస్థిరంగా ఉంచే ప్రకృతి మిత్రులు సముద్ర తాబేళ్లని అన్నారు. కానీ, ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్లక్ష్యంగా సముద్రంలో వదిలే వలలు, మానవ జోక్యం కారణంగా ఈ సముద్ర తాబేళ్ల సంఖ్య తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ మత్స్య వలల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్న తాబేళ్లను ఎలా రక్షించాలో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కపాసుకుద్ది సెక్షన్ అధికారి ఐ.రాము, బీట్ ఆఫీసర్ ఎ.రవికుమార్, సముద్ర తాబేళ్ల సంరక్షణ సభ్యులు, బట్టివాణిపాలెం మత్స్యకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రీ ఫౌండేషన్ సభ్యులు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు


కాలనీలో నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ

ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ పథక సంచాలకులు డి.రమాకాంతరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో హౌసింగ్ కాలనీని సందర్శించారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునే విధంగా గృహ నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. నిర్మాణాల్లో ఉన్న గృహాలకు స్టేజిల వారీగా బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరవుతున్నాయని చెప్పారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో బిల్లు మంజూరుపై ఫిర్యాదు చేసిన మండల కేంద్రం విజ్ఞానవీధికి చెందిన మలిపెద్ది పార్వతి ఫిర్యాదుపై విచారణ జరిపారు. ఈయనతో పాటు హౌసింగ్ డిఇ బి.సన్యాసిరావు, మండల హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

కిషోర్‌పై కేసు నమోదు చేయాలి

నందిగాం: భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై మతోన్మాది, కులతత్వవాది అయిన 71 ఏళ్ల న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేసిన విషయంలో కేంద్ర ప్రభుత్వం, పోలీసులు స్పందించి రాజద్రోహం నేరం కింద సుమోటోగా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎపి దళిత మహాసభ జిల్లా శాఖ అధ్యక్షులు బి.నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై రాకేష్ కిషోర్ చెప్పు విసిరి దాడి చేయడం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, భారతదేశ ప్రజలకు అత్యంత అవమానకరమని పేర్కొన్నారు. సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పెంచి పోషించేందుకు మనువాద, మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఈ దుర్మార్గమైన ఆలోచనతోనే దేశవ్యాప్తంగా ప్రగతిశీల వ్యక్తులపై, మేధావులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌లు సనాతన ధర్మాన్ని భుజానికి ఎత్తుకొని విషప్రచారం చేస్తున్నారని అన్నారు. త తరుణంలో జస్టిస్ గవాయిపై, అలాగే దేశవ్యాప్తంగా ఉన్న మేధావులపైన, రచయితలపైన, కళాకారులపైన, విద్యావంతులపైన, దళిత ఆదివాసీలపైన విపరీతమైన దాడులు జరుగుతున్నాయని అన్నారు.

ఆర్‌వి రోడ్డు సాధన కమిటీ ఏర్పాటు

సంతబొమ్మాళి: రోడ్డు అభివృద్ధికి పార్టీలకతీతంగా ఆర్‌వి రోడ్డు సాధన కమిటీని ఏర్పాటు చేసినట్లు కమిటీ కన్వీనర్ కోత మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చారిత్రక రవాణా మార్గమైన రావివలస-వడ్డితాండ్ర రహదారి అత్యంత దయనీయ స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి గతంలో డోలా, దండులక్ష్మీపురం, బోరుభద్ర, వడ్డితాండ్ర, దండుగోపాలపురం, తలగాం, నందిగాం వరకు కలుస్తూ, కళింగపట్నం పోర్టు వరకు ఏనుగులు, గుర్రాలు, గాడిదల రవాణా సాగిన ప్రధాన వ్యాపార మార్గంగా ఉపయోగించబడిందని తెలిపారు కాలక్రమంలో ఈ రహదారి నిర్లక్ష్యానికి గురై, జిల్లా పరిషత్ రోడ్డు నుంచి ఆర్అండ్‌బి రోడ్డుగా మారినా అభివృద్ధి పనులు జరగలేదని ప్రజలు తెలిపారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల్లో దండుగోపాలపురం బస్టాండ్‌లో అన్ని తరగతుల ప్రజలు, ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అధికారులకు విజ్ఞప్తి పత్రాలు అందజేసి, అవసరమైతే రాలీలు, ధర్నాలు చేపడతామని వెల్లడించారు. 'ఎన్నో హామీలు విన్నాం, కానీ అభివృద్ధి మాత్రం కనబడడం లేదు. ఇక మౌనం వహించే పరిస్థితి లేదు' అని హెచ్చరించారు.

స్కిల్ అడ్వాన్స్ కోర్సుపై శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ కళాశాల ఇసిఇ విభాగం నాలుగో సంవత్సర విద్యార్థులకు ఆ విభాగ అధ్యాపకులు, డాక్టర్ ఇ.జయ సమన్వయంతో 'స్కిల్ అడ్వాన్స్ కోర్స్ డేటా అనలిటిక్స్ యూజింగ్ టాబ్ల్యూ' అనే కోర్స్‌పై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఐటి రంగంలో డేటా అనలిటిక్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను సాధించవచ్చని సూచించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులు టాబ్ల్యూ సాఫ్ట్‌వేర్‌లో డేటా విజువలైజేషన్, రిపోర్ట్ జనరేషన్, రియల్ టైమ్ డేటా విశ్లేషణ వంటి ప్రాక్టికల్ స్కిల్స్ నేర్చుకోడానికి ఎంతో ఉపయోగపడతాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇసిఇ హెడ్ డాక్టర్ అశోక్ కుమార్, అసిస్టెంట్ హెచ్ఒడిడాక్టర్ ఎం.ఎస్.ఆర్.నాయుడు పాల్గొన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్టేట్‌బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.సుశాంత్ మోహనరావు తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడనున్నాయని తెలిపారు. పెన్షనర్లు, బ్యాంక్ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి. సత్యనారాయణ, కార్యదర్శి కాగితాపల్లి సంజీవరావు, పెద్ద భానువీరరావు తదితరులు మాట్లాడుతూ పెన్షనర్లకు ఉచిత వైద్య శిబిరాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

ఎంఇఒ ఆకస్మిక తనిఖీ

జలుమూరు : మండలంలోని జలుమూరు మండల పరిషత్ పాఠశాలను ఎంఇఒ బమ్మిడి మాధవరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి క్రమం తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థుల బోధన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి చెందారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రోణంకి వెంకటరావు తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరగనుందని ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. అలాగే గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించి ఆయా శాఖాధికారులు పరిష్కార నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

యూరియా కొరత లేదు

ప్రజాశక్తి- పలాస

పలాస మండలం చినంచల పంచాయితీ పరిధిలో యురియా కొరత లేదని, వైసిపి నాయకులు రైతులతో సచివాలయం వద్ద ధర్నా చేపించారని టిడిపి నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా చినంచనల రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పంచాయతీలో 1022 ఎకరాలు ఉండగా, 725 బస్తాలు రైతు సేవా కేంద్రానికి వచ్చాయని అన్నారు. అంతేకాకుండా మరో 200 బస్తాలు వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పంపిణీ చేశారని చెప్పారు. వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై అక్కసుతో రైతులతో ధర్నా చేపట్టడం దారుణమన్నారు. ఎవరైతే ధర్నాలో కూర్చున్నారో వాళ్లే యురియా బస్తాలు తీసుకెళ్లినట్టు మా వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఇటువంటి రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో తమ్మినన గంగారాం, అరియపల్లి ప్రభుదాసు, పినకన తిరుమలరావు, పైల విష్ణుమూర్తి, గుంట ధర్మారావు, కంచరాన జగన్, చాపర తిరుపతి, కాశీ మార్కండేయులు, కంచరాన మధు, బమ్మిడి సురేష్, బొచ్చ నాగు, సత్తారు సురేష్, కూన రామయ్య, కిల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


పొందూరు : ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి పోటీల్లో రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో అథ్లెటిక్స్ విభాగాలకు కూర్మాపు ప్రణీత్, అండర్-17 విభాగంలో త్రో బాల్‌కు సవర్ ఆదిత్య ఎంపికైంది. ప్రణీత్ ఎంపికపై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చింతాడ ఉషారాణి మాట్లాడుతూ క్రీడలు మనిషికి శారీరిక మానసిక ఆనందాన్నిస్తాయన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని క్రీడలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించి. స్కూల్ స్థాయిలోనే సరైన తర్ఫీదు ఇచ్చినట్లయితే ఈ దేశానికి మంచి క్రీడాకారులని తయారు చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జి.జగదీశ్వం రావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు గోవింద, షణ్ముఖరావు, నగేష్, లక్ష్మీపతి, ఉమామహేశ్వరరావు మన్మథరావు, జయలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో అద్భుత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియంలో సోమవారం నిర్వహించిన అండర్-19 త్రోబాల్ పోటీల్లో బాలికల విభాగంలో కొంచాడ గాయత్రి, బాలుర విభాగంలో కొంచాడ విజయ్ సీతారాం రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే నరసన్నపేట మండలంలోని సత్యవరంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని మెండ రేణుక అద్భుత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సిహెచ్ శారదాంబ, వ్యాయామ ఉపాధ్యాయురాలు రమణమ్మ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎస్ఎంసి చైర్మన్ కొంచాడ శేషగిరి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు అభినందనలు తెలిపారు.

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు పదోతరగతి విద్యార్థులు స్కూల్‌గేమ్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో టీములకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం పేడాడ వెంకట రమణమ్మ మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పడాల తరుణ్ చెస్‌క్రీడలో ఉత్తమ ప్రతిభ కనపరచగా, 100 మీటర్ల రన్నింగ్‌లో లండ వినయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వీరిద్దరూ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడమే కాకుండా ఆయా జట్లకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు విద్యార్థులు విజయం సాధించడంపై ఉపాధ్యాయులు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.


కవిటి : విద్యార్థులతో ఉపాధ్యాయులు


పలాస : అభినందిస్తున్న హెచ్ఎం

విజయంతో రావాలి

కవిటి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, త్రో బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచి మండలంతో పాటు జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఎంఇఒ-1 ధనుంజయ మజ్జి సూచించారు. మండలంలోని మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి త్రో బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన సరోజ్ జెన్నా విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.వైకుంఠరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రవి కుమార్‌మహంతి, మర్రిపాటి తోటారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: ఈ నెల 6న శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పెద్దతామరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు బమ్మిడి నాగ మునిష్ తెలిపారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 19 ఏళ్ల విభాగంలో ఇప్పిలి వర్ష 400 మీటర్లు, నాలుగు వేల మీటర్లలో ప్రతిభ కనబరిచారు. 17 సంవత్సరాల విభాగంలో వనమాల దిల్లేశ్వరి, 800 మీటర్ల పరువు పందెంలో తృతీయ స్థానం సాధించడంపై ప్రధానోపాధ్యాయులతో పాటు పిడి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎన్.వైకుంఠరావు అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.


మెనూ బోర్డును పరిశీలిస్తున్న హరిబాబు తదితరులు

బిసి హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

లావేరు: విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. లావేరు ప్రభుత్వ బిసి బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన హాస్టల్ గదులు శుభ్రంగా ఉంచేలా చూడాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ఆహార పట్టిక ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని అవసరమైన న్యాయసహాయం అందించడానికి మార్గదర్శకాలు కూడా ఇచ్చారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇంద్ర ప్రసాద్, వార్డెన్ జె.రమేష్ బాబు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ నియామకం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ కన్సలేటివి కమిటీ సభ్యులను ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు నియమించినట్లు డిఆర్‌యుసిసి సభ్యులు సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ కన్సలేటివ్ కమిటీ సభ్యులుగా వి.కె.ప్రసాద్, ఉప్పాడ శంకర్‌రెడ్డి, గోపాల్‌ను కుర్దా రైల్వే డివిజనల్ మేనేజర్ అలోక్ త్రిపాఠి, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సూర్యప్రకాష్ తెలిపారు. రెండేళ్ళ పదవీ కాలమన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధికి ముఖ్యమైన రైలు నిలుపుదలకు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పలాస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లల్లో ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా పలాస నియోజకవర్గ హబ్ పరిధిలో డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐ వద్ద అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్స్‌ను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్‌మ, జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆ పైన పాసైన విద్యార్హత కలిగి 18-35 ఏళ్ల లోపు వయసున్న మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధ్రువపత్రాలు, ఆధార్ జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు హబ్ కో-ఆర్డినేటర్ ఆర్.సోమేశ్వరరావు 6301046329 నంబరును సంప్రదించాలని సూచించారు.

ధర్నాలకు అనుమతి తప్పనిసరి

పలాస : కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో 30 యాక్టు అమలులో ఉందని కాశీబుగ్గ ఇన్‌ఛార్జి డిఎస్‌పి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 30 యాక్టు అమలులో ఉన్న సమయంలో పబ్లిక్ సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు అనుమతి లేకుండా చేయకూడదన్నారు. ఎవరైనా అతిక్రమించి సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, నిరసనలు చేపడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఓట్ చోరీపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని వన్ వే జంక్షన్ వద్ద కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో అఖిల భారత కాంగ్రెస్ ఆదేశాల మేరకు ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జరుగుతున్న ఎన్నికల అవకతవకలు ఓటరు జాబితా లోపాలపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఈ సంతకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం కేంద్రంలోని బిజెపి కలిసి దేశ ప్రజాస్వామ్యాన్ని కూలదోస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే స్వేచ్ఛ కూడా ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీ ఆదేశాల మేరకు ఓటు చోరీపై మరింత తీవ్రంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, సనపల రాజులు, లఖినేని సాయిరామ్, పప్పల అప్పారావు, సీపాన శ్రీరాములు, సువ్వారి రమణ, రాజేష్, రమేష్, పూజారి త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న అన్నాజీరావు

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న రెవెన్యూ అధికారి తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణ రచయితలను భగవత్ సమానులుగా కొలుస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి అదనపు ఎస్‌పి కె.వి రమణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శేషాద్రి, ఎఒ గోపినాథ్, సిఐ శ్రీనివాస్, ఆర్ఐలు నరసింగరావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

బూర్జ: భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో కొండపేటలో మూడో విడత భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు అన్ని ప్రాంతాల్లోనూ ఎప్పటినుంచో రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. భూములు రిజిస్టర్ కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వై.వి.పద్మావతి, వైసిపి నాయకులు వి.గోవిందరావు, టిడిపి నాయకులు నారాయణరావుతో పాటు వివిధశాఖల అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.


కొండపేటలో రీ సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మత్స్యకార కుటుంబానికి అండ

పోలాకి: మత్స్యకార కుటుంబాలకు వైసిపి పెద్దపీట వేసిందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని గుల్లవానిపేట మత్స్యకార సంక్షేమ భవనంలో మంగళవారం కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సిఎం చేసేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, రాష్ట్ర యువజన కార్యదర్శి చింతు రాఘవ, మండల యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, సర్పంచ్‌లు వారధి మోహనరావు, నందుపల్లి పైడితాత, ఎంపిటిసి తులే పైడమ్మ పాల్గొన్నారు.

బెలమాం పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు

ఆమదాలవలస: మండలంలోని బెలమాం పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు లభించింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ చేతులమీదుగా అంబేద్కర్ కళావేదికలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. గతంలో బెలమాం కార్యదర్శిగా పనిచేసిన దమయంతి ఈ అవార్డును స్వీకరించారు. పంచాయతీ పరిధిలోని లొద్దలపేటలోని చెత్త సంపద కేంద్రంలో వర్మీకంపోస్ట్ తయారీ, స్వచ్ఛభారత్ కమిటీ సహకారంతో చెత్త నిర్వహణ, చెత్త సంపద కేంద్రం ఆవరణలో మొక్కలు నాటడం, సర్పంచ్ కిషోర్ సహకారంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో ఈ అవార్డు లభించిందని దమ్యంతి తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి: పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు రిజిస్ట్రేషన్ అవసరాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, దీనివల్ల సమయంతో పాటు ఆర్థిక భారం పెరుగుతుందని వివరించారు. నియోజకవర్గం కేంద్రంలోనే కార్యాలయం ఏర్పాటు చేస్తే పాతపట్నం, మెళియాపుట్టి మండల ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.

జిఎస్‌టిపై వ్యాసరచన పోటీలు


కవిటి : పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు

ప్రజాశక్తి- కవిటి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జిఎస్‌టి 2.0పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్' అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు కూడా నిర్వహించారు. ఈ పోటీల్లో తెలుగు మాధ్యమంలో ఎస్.దుర్గ ప్రథమ, డి.ధనలక్ష్మి ద్వితీయ స్థానం సాధించగా, ఆంగ్ల మాధ్యమంలో వై.చిన్ని ప్రథమ, యు.శిరీష్ ద్వితీయ స్థానం పొందారు. చిత్రలేఖనంలో జె.మహేంద్ర ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరి, ఎంజిఎంఒ కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, జనార్ధనరావు, బి.అంజన పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని దండుగోపాలపురంలో జిఎస్‌టి తగ్గింపు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 36 మంది విద్యార్థులు వ్యాసరచన, 42 మంది చిత్రలేఖనలో పాల్గొన్నారు. పరిశీలకునిగా పంచాయతీ సెక్రటరీ బమ్మిడి సాయిసిద్ధార్థ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిఆర్‌పి గిరి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం మహాలక్ష్మి అధ్యక్షతన సూపర్ సేవింగ్స్-సూపర్ జిఎస్‌టి అంశంపై ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని మొత్తం 18 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసరావు, నోడల్ అధికారి కె.శ్రీనివాస్, ఎఒఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో సూపర్ జిఎస్‌టిపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు కె. అప్పారావు, ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.

పలాస : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జిఎస్‌టి తగ్గింపుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ విషయమై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, అధ్యాపకులు రామ్మోహన్‌దొర, సరస్వతి, రమేష్, యుగంధర్, తపన్‌కుమార్ జెనా, ప్రసాదరావు, జయప్రకాష్, ప్రవీణ్, సాగరిక, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుబాబు, వాసుదేవరావు, పాపారావు పాల్గొన్నారు.


బూర్జ : విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న మండల ప్రత్యేక అధికారి

సరుబుజ్జిలి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిఎస్‌టిపై విస్తృతమైన అవగాహనలో భాగంగా 'భారత ఆర్థిక వ్యవస్థపై జిఎస్‌టి ప్రభావం' అనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైడి పద్మావతి తెలిపారు.ఎన్ఎస్ఎస్ పిఒ రమేష్ సాహు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ : విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని పశుపోషణ సంరక్షణ శాఖ జెడి, మండల ప్రత్యేకాధికారి జి.నారాయణ రావు సూచించారు. మంగళవారం మండలంలోని ఓవిపేట మోడల్‌స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు జిఎస్‌టిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అనుకొన్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఆయనతో ఎంఇఒలు బి.ధనుంజయరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి- కవిటి


ఉరివేసుకున్న సురేష్

మండలంలోని సహలాల పుట్టుగకు చెందిన గొనియా సురేష్ జీడితోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు... గ్రామంలోని జీడి తోటలో గొనియా సురేష్ చెట్టుకు ఉరివేసుకుని ఉండడం అతని అక్క కొటియా పద్మ చూసి గ్రామస్తులకు సమాచారం అందించిందన్నారు. అనంతరం కవిటి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. దీనిపై హెచ్‌సి శ్రీనివాసరావు అనుమానస్పద కేసుగా నమోదు చేశారు. మృతదేశహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు.

వ్యక్తికి జైలు శిక్ష

శ్రీకాకుళం సిటీ: పట్టణంలో మద్యం సేవించి సోమవారం ట్రాఫిక్‌కు ఇబ్బంది పెట్టి, అలజడి సృష్టించిన దమ్మల వీధికి చెందిన తమిరి సాయి అనే వ్యక్తికి 45 రోజులు జైలుశిక్షను కోర్టు విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ మంగళవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుపెట్టి అరెస్టు చేశామన్నారు. మద్యంమత్తులో పోలీసులకు చిక్కిసైతం వీరంగం సృష్టించాడన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు సిఐ నాగరాజు చెప్పారు.

పలాసలో...

పలాస : రోడ్డు ప్రమాదం కేసులో పలాస ఆర్‌టిసి డ్రైవర్‌కు ఐదు నెలలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పును నిచ్చారు. 2020లో ఆర్‌టిసి డ్రైవర్ సుంకర వెంకటరమణ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ... రోడ్డు ప్రమాదానికి జరిగినట్లు అప్పటి మల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కేసు దర్యాప్తు చేశారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

చీడపీడల నివారణకు చర్యలు

కోటబొమ్మాళి: వరిసాగులో చీడపీడలకు నివారణా చర్యలు తప్పని సరిగా పాటించాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు అన్నారు. ఎఒ ఎస్.గోవిందరావుతో కలిసి కోటబొమ్మాళి సచివాలయం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణ చర్యలు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులపైనే కాకుండా జీవన ఎరువులు వినియోగించాలని వారు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ప్రభాకర్

మానవత్వం పరిమళించిన వేళ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోసమాలకు చెందిన డోల శేఖర్‌కు ఉప్పలాడ కేంద్ర పరిసర ప్రాంతాల్లోని హెల్ప్ ఎవర్ హార్ట్ నెవర్ అనే సేవా సంస్థ రూ.పది వేలు వైద్య సహాయం కోసం మంగళవారం అందజేశారు. ఈ సంస్థ ద్వారా ఇప్పటికే పేద ప్రజలకు ఆర్థిక, విద్య, ఆరోగ్యపరమైన 153 కార్యక్రమాలు ద్వారా రూ.12,01,794 ఆంధ్ర, ఒడిశా ప్రజలకు అందజేసినట్లు సంస్థ అధ్యక్షులు బల్ల ప్రభాకర్ తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న బాసుదేవ్ ప్రదాన్

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

స్థలం కేటాయిస్తే పిఎసిఎస్‌కు శాశ్వత భవనం నిర్మిస్తామని ఇటీవల కవిటి వచ్చిన డిసిసిబి అధ్యక్షుడు ప్రకటించడంపై పిఎసిఎస్ కార్యవర్గం స్పందించింది. మంగళవారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిసిన పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, స్థానిక నాయకులు పిఎసిఎస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విప్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి తక్షణమే పిఎసిఎస్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, బెందాళం తిరుమల కుమార్, వజ్జ రంగారావు, పిఎసిఎస్ సిఇఒ బెందాళం చిరంజీవి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు మండలం రెడ్డి కిల్లిపాలెం అంగన్వాడీ కేంద్రం ఎంపికైంది. ఈ అంగన్వాడీ కేంద్రంలో స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ పచ్చదనం పరిశుభ్రత పాటించారు. దీంతో ఈ అంగన్వాడీ కేంద్రాన్ని స్వచ్ఛ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ అవార్డులు అందజేయగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులమీదుగా అంగన్వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి అవార్డు స్వీకరించారు. ఈమెను గ్రామస్తులు అభినందించారు.

మృత్యుంజయునికి కిరణస్పర్శ

కవిటి: మండలంలోని ముత్యాలపేటలోని మహా మృత్యుంజయుని ఆలయంలోని శివలింగాన్ని మంగళవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఆలయ గర్భగృహంలో కిరణాలు పడిన క్షణాలను చూశారు. పౌర్ణమి తిథి కావడంతో ఈ విషయం తెలిసిన స్థానికులు ఆలయానికి పోటెత్తారు. సూర్యకిరణాలు శివలింగాన్ని తాకిన దృశ్యం యాత్రికుల హృదయాల్లో ఆధ్యాత్మిక నింపింది.